# అమ్మ

దుత్తా దుర్గాప్రసాద్



రెండో ఆట కూడా వదిలేశారు. జనం అలికిడి తగ్గిపోతూ వుంది. సినిమాహాలు దగ్గర అట్ల దుకాణాల వాళ్లు 'అణాకి మూడు!' అని అరవడం మానేశారు.

శాంతమ్మ మెల్లిగా దుకాణం సర్దేసుకొన్నది. పొయ్యి ఆర్పి చాలాసేపయింది. కుంపటీ, కట్టెలూ పట్టుకెళ్లి గురవయ్యకి ఒప్పచెప్పి వచ్చి గిన్నెలు సర్దుకొన్నది తట్టలోకి. అట్లపిండి చాలా మిగిలిపోయింది. అయినా ఫరవాలేదు. రేపు నాలుగు శెనగబేడలు కలిపి పులి బొంగరాలు చేస్తే, అవే ఖర్చయిపోతాయి. కాని ఈ అట్లే ఎనిమిది మిగిలిపోయాయి. చప్పగా చల్లారి కట్టెల్లా తయారయ్యాయి. 'ఫరవాలేదులే. పిల్లలు నవులుతారు' అనుకుని తట్టనెత్తి కెత్తుకొని నడవసాగింది.

పార్కులో గడియారం రెండు గంటలు కొట్టింది. ఈరోజు మూడు రూపాయల బేరం కూడా సాగలేదు. అయిదు గంటలనుంచి అలాగే కూర్చుని ఉన్నందున నడుములు పట్టుకుపోయాయి శాంతమ్మకి. మెల్లిగా నడవసాగింది.

ఇంటి దగ్గర కొడుకు పోరు ఎక్కువైపోతూ వున్నది రోజు రోజుకి. "ఇంత ముసలితనం వచ్చినా యింకా ఏమిటమ్మా ఈ పాడు వ్యాపారం" అంటాడు రమణయ్య. కాని శాంతమ్మకి తెలుసు తను ఎలాగో ఆ రూపాయి డబ్బులు తేలేకపోతే, కొడుకు కొచ్చే అరవై రూపాయల తోటే సంసారం గడవదని. చిల్లర కొట్లో గుమస్తా రమణయ్య తన యిరవై ఏళ్ల సేవతో షావుకారుని మెప్పించి, ఇవ్వాళ అరవై రూపాయల జీతం అందుకొన్నాడు. మొగుడూ పెళ్లాం, ఇద్దరు పిల్లలూ కాక తను కూడా వీళ్లమీదే పడితే, ఎక్కడి నుండి తెచ్చిపెడతాడు 'రమణయ్య'. అప్పటికీ తన సంపాదన కూడా వేణ్ణీళ్లకి చన్నీళ్లలాగా జోడించినా, సంసారం నెట్టుకు రావడం భారంగానే వుంది.

తన కోడలు ఉత్తమురాలు. లేదని అనిపించకుండా ఆ సంసారాన్ని నెట్టుకొస్తూ ఉన్నది పదిహేను సంవత్సరాలబట్టీ.

తన గురించి యింత బెంగెందుకు వాడికి. తను పుట్టి పెరిగాక, ఇంతకన్నా సుఖమనేది తెలీదు తనకి. ఇన్నాళ్లుగా లేని బాధ యిప్పుడే పుట్టుకురావడమేమిటి వీడికి. 'ఆ వ్యాపారం మానేయమ్మా' అని అంటాడు. కాని, సంసారం విషయం వాడికేం తెలుసు పిచ్చి బంగారం! మొదటి నుంచీ అంతే. కల్లా కపటం లేని నాగన్న!

అసలీ గొడవంతా ఎందుకొచ్చింది. చిన్నకొడుకు బంగారంలా ఏడువందల రూపాయల జీతం తెచ్చుకొంటున్నాడు. ఊ అంటే నెలకు కనీసం వంద రూపాయలు పంపుతాడు. రమణయ్య సంసారం హాయిగా గడిచిపోతుంది. కాని, వీడా కూడు లేకపోతే వాడి చచ్చిపోతానంటడు గాని వాడి డబ్బు మాత్రం ముట్టుకోడు.

వాడు మాట వినకుండా మరో కులం పిల్లనే చేసుకొన్నాడనుకో. పన్నెండేళ్ల బట్టీ సంసారం చేసుకొంటున్నవాడు, యివ్వాళ పెళ్లాన్ని మనకోసం వెళ్లిపొమ్మంటాడా? ఆ పిల్లయినా ఎంతో బుద్ధిమంతురాలట. కరణంగారూ, వాళ్లూ వెళ్లి చూసి వచ్చి చెప్పారట గదా 'కొడుకూ, కోడలూ లక్ష్మీనారాయణుల వంటి వారమ్మా' అని.

చిన్నతనంలో వాడంటే ఎంత అభిమానం రమణయ్యకి నలభై రూపాయల జీతం తెచ్చుకుంటూ నెల నెలా యిరవై రూపాయలు తమ్ముడికి పంపేవాడు. వాడు 'అక్కర్లేదన్నయ్యా!' అని వుత్తరాలు వ్రాసినా వినేవాడు కాదు. అలాంటిది ఆ పెళ్లితో వీడికీ వాడికీ ఋణం తీరిపోయినట్టేనా! రెండు మూడు మార్లు మనియార్డరు వస్తే పోస్టుమెన్ మొహం మీద పారేశాడు రమణయ్య. అంతటితో డబ్బు పంపడం మానేశాడు చిన్నవాడు.

రమణయ్య పిల్లలుగూడా ఎదిగి నెత్తిమీద కూర్చున్నారు గదా! అమ్మాయి పెళ్లికి తయారై వుంది. అబ్బాయి కాలేజీలో చేరి పై చదువులు చదువుతానంటున్నాడు. ఇవేవీ పట్టలా రమణయ్యకి, తన మంకుపట్టు తనది.

ఇల్లు చేరింది శాంతమ్మ. రమణయ్య మండిపడుతున్నాడు భార్య మీద. తను యింకా యిల్లు చేరలేదని. తనని చూసి చివ్వున లేచాడు. "నీకేమైనా మతి వుందా! తెల్లవారబోతూ వుంటే నువ్వింకా అక్కడ పొతుకు కూర్చుని చలికి చస్తూ వుంటే, ఇక్కడ తలుపులు బిగించుకొని మేము వెచ్చగా పడుకొని వుంటే నలుగురూ నా మొహం మీద ఉమ్మేస్తారు. ఆ జ్ఞానం అయినా లేదా నీకు! నెత్తీ నోరూ కొట్టుకుంటున్నాను. ఉన్న దాంట్లో గంజినీళ్లే తాగుదాము. నువ్వు యింక ఆ పని మానుకోవమ్మా అని దేనికంత దావాది నీకు నేనీ కొంపలో వుండకుండా పోవాలి. అంతే ఆఖరికి" అని గుడ్ల నీరు కుక్కుకొన్నాడు.

"ఊరుకోరా రమణయ్యా! ఈ రోజున కొత్తా నాకీ పని? పగలంతా నిద్దరపోతూనే ఉంటాను గదా. ఇంటిపనంతా కోడలిపిల్లే నెట్టుకొస్తుందాయె యిహ నాకేం దిగులు! ఊరికే తిని కూర్చుంటుంటే, యింత మంది పొట్టలు ఎట్లా నిండుతాయి? నీకేం నీవు అంటావు ఆ ఎదిగిన పిల్లను చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది నాకు" అని గట్టిగానే అన్నది.

రమణయ్య మాట్లాడలేదు. తలుపు భడాలున

తెరుచుకొని బయటకిపోయి అరుగుమీద కూలబడ్డాడు. 'రోజా వున్న గొడవలే' అనుకొని శాంతమ్మ భోజనం ముగించుకొని తలవాల్చింది.

కాని రమణయ్య అన్నంత పనీ చేశాడు. శాంతమ్మ యింటికొచ్చేసరికి కోడలు శోకమూర్తిలా వుంది. నా చేతికి డబ్బు యిచ్చి 'అమ్మని రమ్మని తమ్ముడు మరీ మరీ ఉత్తరాలు రాస్తున్నాడు. అక్కడికి వెళ్లమను. ఇక ఆవిడ యీ ఊళ్లో వుంటే నేనీ గడపతొక్కను' అన్నారత్తయ్యా అని భోరున ఏడుస్తూ శాంతమ్మ చేతిలో డబ్బు పెట్టింది. శాంతమ్మ కళ్లంట నీళ్లు చిమ్ముకొచ్చాయి. కోడలు పిచ్చిపిల్ల. తను లేందే ఒక్కరోజు బ్రతకలేదు. కొడుకు చూస్తే అలాగు. 'సరే, వాడికింత కష్టమయినప్పుడు నేనిక్కడ దేనికి తల్లీ అలాగే వెళతాను. పిల్లల్నీ, వాడినీ జాగ్రత్తగా చూసుకోవమ్మా!' అని అప్పటికప్పుడే ప్రయాణమై యిల్లు వదిలేసింది.

కోడలు తలుపులేసుకుని పిల్లలిద్దరినీ కావలించుకొని, దొర్లి దొర్లి ఏడిచింది. పసివాళ్లిద్దరూ నిద్దురలో పడి అమ్మ శోకం పాలు పంచుకోలేదు.

000

చిన్న కొడుకు రామారావు తుంగభద్ర డాంలో పెద్ద ఇంజనీరు. ఆరు ఏడు వందల రూపాయల జీతం. బస్సు దిగి ఆయన పేరు చెప్పగానే పదిమంది పోగయ్యారు తన చుట్టూ. ఆయన తల్లి అని తెలిసి, వాళ్లలోంచి ఒకడు పరుగెత్తుకొంటూ పోయి, ఎక్కడినుంచో ఒక జీపు పట్టుకొచ్చాడు.

తల్లిని చూచి నిశ్చేష్టుడైపోయాడు రామారావు ఒక నిముషం అలాగే నిలబడిపోయి. తర్వాత 'అమ్మా' అంటూ కావలించుకుని, రుద్ధమైన కంఠంతో 'ఎన్నాళ్లకి వచ్చావమ్మా' అని మరి మాటాడలేకపోయాడు.

చిన్న కోడలు కూడా వెంటనే పసిగట్టేసింది. పని మనిషిని పురమాయించి వెంటనే వేణ్ణీళ్లు తోడించింది. తన చీరల్లోంచి ఒక తెల్లచీర పట్టుకొచ్చి యిచ్చింది. పీటవేసి అన్నం వడ్డించి కొడుకూ కోడలూ చెరోపక్కా కూచుని భోజనం తినిపించారు.

రామారావుకి పిచ్చెత్తినట్టయింది. సహజంగా మితభాషి అయిన అతను పసపిట్టలా మాట్లాడసాగాడు. ఊళ్లో అందరి క్షేమ సమాచారాలూ అడిగాడు. అన్నయ్యా, వదినా బాగున్నారా అన్నాడు. పిల్లలు పెద్దవాళ్లయ్యారా అన్నాడు. నన్ను మరచిపోయావనుకొన్నానమ్మా అన్నాడు. ఆ రోజంతా పనిమీదకి పోకుండా యింట్లోనే వున్నాడు. కోడలు కూడా చొరవ చేసుకొని మాట్లాడసాగింది. 'అక్కయ్యా, బావా



## సమీర గట్టిదే!

రామ్‌గోపాల్‌వర్మ చిత్రం 'డర్‌నా మనా హై'తో ఓ మంచి పాత్ర కొట్టేసిన సమీరారెడ్డి ఇద్దరు మోడల్ సుందరాంగుల చిన్నచెల్లెలు. తరువాత నిర్మాత ప్లస్ ఫ్రెండ్ సంజయ్ గుప్త తన 'ప్లాన్'లో సెకండ్ హీరోయిన్‌గానూ, 'ముసాఫిర్'లో హీరోయిన్‌గానూ తీసుకున్నాడు. 'నో ఎంట్రీ'లో సల్మాన్ ఖాన్, అనిల్ కపూర్, బిపాశాబాసు, ఫర్దీన్ ఖాన్, లారాదత్త, సెలీనాజేట్లీలతో కలిసి చేస్తున్నది. దీని కోసం బోనీకపూర్ చిత్రం వదులుకుందిట. బహిరంగంగానే సంజయ్ గుప్తతో చెట్టపట్టాలేసుకునే సమీర గట్టి అమ్మాయే ననుకుంటున్నారు.

బాగున్నారా!' అన్నది. 'పిల్లల్ని కూడా తీసుకురాలేకపోయారా' అన్నది. 'మీ ఫొటోకి రోజూ ఆయన దణ్ణం పెట్టుకొంటారు!' అని చెప్పింది.

శాంతమ్మ మనసు ప్రేమతో ఊగిపోయింది. కోడలి తలను నిమురుతూ 'నా బిడ్డ అదృష్టవంతుడమ్మా!' అన్నది.

అలా రెండు రోజులు గడిచాయి. శాంతమ్మకి యిక్కడి పరిస్థితి అవగాహన అవసాగింది. కొడుకు చాలా పెద్ద ఆఫీసరు. పెద్ద బంగాళా, పూలతోటా, నౌకర్లూ, చాకర్లూ, కాలు కదిపితే కారూ, ఇవన్నీ చూసి తన కొడుకుని తలచుకొని గర్వపడింది. కాని అంతలోనే ఒక కారు మేఘం ఆమె మొహం మీదకి కమ్ముకొచ్చింది. రమణయ్య గుర్తుకొచ్చాడు తెల్లవారుజామున ఆరింటికి కొట్టుమీదికి పోయి రాత్రి తొమ్మిదింటికి ఇల్లు చేరతాడు! మధ్యలో హడావుడిగా నాలుగు మెతుకులు కొరికిపోతాడు. అయినా వాడికి పొట్ట గడవడమే కష్టంగా వుంది. ఇద్దరి కొడుకుల్నీ పోల్చి చూసుకొనేసరికి ఆ తల్లి హృదయం ఆవేదనతో తల్లడిల్లిపోయింది.

ఆ రాత్రి, రామారావు వాళ్ల ఆఫీసరు బదిలీ అయి వెళ్లిపోతున్న సందర్భంలో ఒక డిన్నరు ఏర్పాటు చేశాడు. పెద్ద పెద్ద వాళ్లంతా యాభయ్ మంది దాకా వచ్చారు. ఆడవాళ్లతో సహా. వాళ్లతో తినమంటే, తిననన్నది శాంతమ్మ. వాళ్లంతా వెళ్లిపోయాక అన్నం ముందు కూర్చుంది.

ఆ భోజనమూ, వంటకాలూ చూసేసరికి కళ్లు తిరిగిపోయాయి శాంతమ్మకి. పదిహేను రకాల కూరలూ నాలుగైదు పిండివంటలు ఐస్ షర్బత్తు. కాని, ఇవన్నీ చూసి పొంగి పోలేదు శాంతమ్మ! నోట్లో ముద్ద పెట్టుకోబోయే సరికి రమణయ్య గుర్తుకొచ్చాడు, పిల్లలు గుర్తుకొచ్చారు. వాళ్లు తినే కూడు తల్చుకొనే సరికి శాంతమ్మకి కళ్లంట నీళ్లు తిరిగాయి. ఒక్క తల్లి బిడ్డల్లోనే ఎంత వ్యత్యాసం పెట్టాడు దేవుడు! దేనికి ఇంత తేడా వీళ్లల్లో! రమణయ్య చెడ్డవాడా? నోట్లో నాలుకలేని పిచ్చిబాబు! వాడికి ఎందుకు అన్యాయం చేశాడు దేవుడు! పిచ్చినాగన్న యిల్లు చేరాడో లేదో. కోడలు పిల్ల వెర్రిది. తను లేందే ఒక్క పని చేసుకోలేదు. అన్నం వండుకొన్నారో లేదో ఆ పిల్లలు అలాగే డొక్కల్లో కాళ్లు పెట్టుకొని పడుకొంటారేమో

శాంతమ్మ కనుక్కున విస్తరు ముడిచేసింది. గబగబా వెళ్లి చేయి కడుక్కొంది. కోడలు అడిగితే ఒంట్లో బాగులేదన్నది.

మర్నాడు కొడుకు డామ్ చూపించడానికి తీసుకుపోయాడు. కొండమీద బంగళాకి వెళ్లారు. అక్కడి పూలతోటలూ, అవీ చూసి ఆశ్చర్యపడింది. బ్రహ్మాండమైన ఆ కట్టడాన్ని కొండమీద నుండి చూసేసరికి కళ్లు తిరిగిపోయాయావిడికి. ఇదంతా మానవ నిర్మితమేనంటే నమ్మలేకపోయింది. కిందికి దిగి పవర్‌హౌస్ దగ్గరికి పోయారు. అక్కడి కాలువల్ని చూపిస్తూ ఉన్నాడు కొడుకు.

ఇంతలో 'ఇక్కడున్నావేం శాంతమ్మా!' అన్నాడెవరో. ఉలిక్కిపడి వెనక్కి చూసింది శాంతమ్మ. తన వూరి మనిషి. 'మా అబ్బాయి కిష్టయ్యన్నా. చూసి పోదామని వచ్చాను' అన్నది రామారావుని చూపించి, సిగ్గుతో తలవంచుకున్నాడు రామారావు. అతనెవరో కూలివాడు. తన తల్లిని 'ఇక్కడున్నావేం శాంతమ్మా' అని అంత మొరటుగా అడగడం, ఈమె అంత వినయంగా సమాధానం చెప్పడం అతనికి తల తీసేసినట్లయింది. రుసరుసా వెళ్లి కారులో కూర్చున్నాడు. శాంతమ్మ మాత్రం అతని క్షేమ సమాచారాలు అడుగుతూనే వున్నది. ఆమె వెళ్లి ఎక్కగానే 'ఛర్రున' స్టార్ట్ చేసి వేగంగా పోనిస్తున్నాడు. ముభావంగా వున్న అతన్ని చూసి 'అలా వున్నావేం బాబూ' అన్నది. రామారావు తల తిప్పకుండానే మెల్లిగా అన్నాడు. 'అలా తక్కువ రకం వాళ్లతో అంత యిదిగా మాట్లాడకూడదమ్మా' అని.

శాంతమ్మ అదిరిపోయింది. ఆమెకర్థమయింది. రెండు నిముషాలు మాట్లాడలేదు. కారు పరుగెడుతూనే వుంది.

"చిన్నతనంలో నువ్వు తాటాకు బండి కట్టుకొని పేడ వేసుకొచ్చేవాడివి. నేను పిడకలు కొట్టి యిస్తే, అవి గంపల కెత్తుకొని కరణంగారి యింట్లోనూ, రెడ్డి నాయుడిగారి యింట్లోనూ, వేసి వచ్చేవాడివి. పేట రోడ్డంట చింతచెట్లన్నీ యెక్కి చింత చిగురు తెచ్చేవాడివి. అది అమ్మేదానిని నేను. నీకు గుర్తుందా బాబూ! మన అదృష్టం కలిసి వచ్చి, నీ తెలివీ వినయం చూసి, ఆ రెడ్డి నాయుడుగారు సహాయం చేయకపోతే నువ్వు యింతటి వాడివయే వాడివా బాబూ! ఆ రోజుల్లో మనం ఒక పూట తింటే రెండో పూట వస్తుండేవాళ్లం. మీ నాయన పోయాక ఎందుకూ కొరగాకుండా పోయింది మన సంసారం" మాట్లాడుతూ మాట్లాడుతూ ఠక్కున ఆగిపోయింది శాంతమ్మ. కొడుకు మొహం కళావిహీనమై పోయివుంది. ఆమె కర్థమయింది 'కొడుక్కి గతమంటే పీడకలలా వుందని!' మరి మాట్లాడలేదు.

ఆ రోజు రాత్రి యింకొక ఆపీసరుగారి యింట్లో డిన్నరట. వాళ్ల ఆఫీసరు బదిలీ అయిపోతుంటే ప్రతి వాళ్లూ అలా యిస్తారట. శాంతమ్మ తను రాలేనన్నది. అయినా వదల్లేదు. కొడుకూ, కోడలూ బలవంతం చేసి లాక్కుపోయారు.

డిన్నరు జరిగే యిల్లు విద్యుద్దీపాల కాంతిలో ధగధగా మెరిసిపోతూంది. ఆడవాళ్లంతా దొడ్డివేపు తోటలో కూర్చుని వున్నారు కుర్చీల మీద. వందల ఖరీదు చేసే చీరలతో మెరిసిపోతున్నారు వాళ్లు. వాళ్లలో రెండు రకాల మనుషులు కనిపించారు శాంతమ్మకి. ఒక వర్గం హుందాగా, మౌనంగా కూర్చుని వున్నారు. రెండో వర్గం ఊరికే బడిపిల్లల్లాగా కేరింతలు పెడుతున్నారు. వాళ్ల అలంకరణలాగే, వారి మాటలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఎవరిని చూసినా తమ గొప్పదనం చెప్పుకొనేవాళ్లే! వాళ్ల తండ్రిగారు కోటీశ్వరుడంటుంది ఒకావిడ. వాళ్ల నాన్నగారంటే మినిష్టర్లే గజగజలాడి పోతారంటోంది యింకొకావిడ. మరొకామెకి వాళ్లాయన తెచ్చే నాలుగొందలూ సాదరు ఖర్చులకే చాలవట. నెలనెలా వాళ్ల నాన్న ఐదు వందలు పంపుతాడట యిదీ ధోరణి:

అందరిలోకీ తన కోడలే నయమనిపించింది శాంతమ్మకి. అంతా మాట్లాడుతుంటే కోడలు మాత్రం ఓపిగ్గా వింటూ కూర్చున్నది.

కాసేపటికి వర్షం వెలిసినట్లు, యీ మాటల జోరు కూడా తగ్గింది. ఉన్నట్టుండి ఒకావిడ 'వీరెవరండీ?' అంది శాంతమ్మని చూపించి.

"మా అత్తగారు, మొన్ననే వచ్చారు" అంది కోడలు.

"ఏ ఊళ్లో వుంటారేమిటి?"

చెప్పింది కోడలు.



## బాలీవుడ్‌లోకి మరో మోడల్

వీడియో కాన్ బజూంబా, బ్రిటానియా మస్కా చస్కా, వీల్ డిటర్జెంట్ సబ్బు (గోవిందతో) ప్రకటనల్లో కనిపించిన యువతి విద్యామాల్వాడే. ఈమె భర్త ఓ పైలట్. దురదృష్టవశాత్తూ ఓ ప్లేన్ క్రాష్‌లో మరణించాడు. మోడల్ రంగం నుంచి బాలీవుడ్‌కు రావాలనుకున్న విద్య, 'ఆప్ ముఝే అచ్చే లగ్‌నే లగే' సెట్ల మీద దర్శకుడు విక్రమ్ భట్‌ను కలిసింది. తన తరువాతి చిత్రం 'ఇంతెహా'లో విద్యకు అవకాశమిచ్చాడు విక్కీ. ఈ మాయాప్రపంచంలో ఎవరి కెప్పుడు కలిసొస్తుందో ఎవరికి తెలుసు?

"అక్కడెవరున్నారు?"

"మా బావగారు ఆవిడ మొదటి కొడుకు".

"ఆయనేం చేస్తుంటారు?"

కోడలు మొహం మీద విసుగు కనిపించింది ఒక్కక్షణం అలాగే జవాబు చెప్పింది. "పచారీ సామాను హోల్‌సేల్ వ్యాపారం."

"పచారీ సామానా బాగా లాభాలు వుంటాయా అండీ!" అంది ఆవిడ సాగదీస్తూ, మొహం అదోలా పెట్టి.

కోడలు చిన్నబోయినట్లు మొహం పెట్టుకొని 'లాభాలకేమండీ! మన జీతాలకన్నా రెట్టింపు సంపాయిస్తారాయన!' అనేసి చటుక్కున లేచి ఎవర్నో పలకరించను పోయింది మరో వైపుకి. శాంతమ్మ దిగ్భ్రాంతి చెందింది. తన కోడలు అలా అబద్ధాలు యెందుకు చెప్పింది

కాస్త ఆలోచించేసరికి తనకే అర్థమయింది. అవును ఇప్పుడొక కృత్రిమమైన వాతావరణం పెనవేసుకొని వుంది. అలా గొప్పలు చెప్పుకోందే గౌరవం కాదని వీళ్ల అభిప్రాయం. వీళ్ల మధ్య కోడలుకు అంతకన్నా గత్యంతరం లేదు.

ఇంటికొచ్చాక కూడా శాంతమ్మ తీవ్రంగా ఆలోచించసాగింది. ఆలోచించే కొద్దీ నగ్న సత్యాలు కనిపించసాగాయి. తను పెరిగిన సమాజానికీ, దీనికీ ఎక్కడా పోలిక లేదు. ఇక్కడ తన ఉనికి వలన కొడుక్కీ, కోడలికి అప్రతిష్ట కలుగుతోంది. తన గత జీవితాన్నీ, తన మొదటి కొడుకునీ పూర్తిగా వదులుకొంటేనేగాని ఇక్కడి వాతావరణంలో యిమిడిపోదు తను. కాని తనకు ఈ సుఖాలు అక్కరలేదు యీ ఔన్నత్యమూ అక్కరలేదు. అక్కడ తన బిడ్డ మరొకడు ఆకలితో పడి వున్నాడు. చిన్నవాడికేం ఫరవాలేదు. వాడికి తను చేయగలిగిన సహాయమూ లేదు. తను చేయగల్గిందేదైనా వుంటే అది అక్కడే! మర్నాడు పొద్దుటే గుడ్డలు సర్దుకుని ప్రయాణమైంది శాంతమ్మ, కొడుకూ, కోడలూ కాళ్లా, వేళ్లా పడి బ్రతిమాలినా 'ససేమిరా' అన్నది.

చివరికి 'నేను కొడుకును కానా అమ్మా!' అన్నాడు రామారావు బాధగా! 'నువ్వు కొడుకువే బాబూ! నిన్ను చూచుకొని గర్వించదగిన కొడుకువి. అయినా నీకు నేను చేయగల్గిందేమీ లేదు. ఎక్కడ నేను ఉపయోగపడతానో అక్కడ వుండడం నా కర్తవ్యం.'

"అంటే నువ్వు నా దగ్గర వుండాలంటే నేను కూడా పనికిమాలిన వాడిని కావాలన్నమాట!" అన్నాడు రామారావు కోపంగా.

"నీకు అర్థం కాదు బాబూ తల్లి బాధ! నేను నీకు చెప్పగలిగిన దాన్ని కూడా కాదు!" అని బయల్దేరింది శాంతమ్మ.

రామారావు రెండు వందల రూపాయలు అమ్మ చేతిలో పెట్టబోయాడు. శాంతమ్మ తీసుకోకుండా 'నాకు వద్దు బాబూ, ఈ డబ్బుతో నేనక్కడకు పోతే నా ముఖం కూడా చూడడు వాడు' అంది. రామారావు కళ్లంట గిర్రున నీరు తిరిగింది.

రైలు కదిలిపోయింది.

రమణయ్య యింటికొచ్చే సరికి అమ్మ కుక్కి మంచం మీద పడుకొని వున్నది. కోడలు భయం భయంగా 'ఏమండీ మళ్లీ మాటలని ఆవిడ గుండెలు కోత పెట్టకండి. ఆమెని క్షోభపెడితే మనకీ నూకలు కూడా పుట్టవు' అన్నది.

రమణయ్య రెండు క్షణాలు అలా చూసి 'పిచ్చిదానా, నాకు నా తల్లి బరువనుకున్నావా? ఆమె మనస్సు నొప్పించి అయినా తమ్ముడు దగ్గరకు పంపితే, అక్కడ కాస్త సుఖంగా బ్రతుకుతుందనుకొన్నాను. కాని ఆమె లేని ఈ వారం రోజులూ స్మశానంలా వున్నది యిల్లు. నా బాధ ఒకటే తల్లికి కూడు పెట్టలేని నన్ను దేముడు కూడా క్షమించడు' అని రుద్ధమైన కంఠంతో పీటమీద కూలబడ్డాడు.

శాంతమ్మ మేలుకొన్నదో లేదో తెలీదు. కాని ఆమె తలగడ మాత్రం తడిసి ముద్దయిపోయింది.

(మొదటిసారి స్వాతి మాసపత్రిక (1980 ప్రాంతం)లో ప్రచురితం)